## క్లుప్తంగా

### హెల్మెట్‌తో ప్రాణరక్షణ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చెన్నారావు

కామవరపుకోట: ప్రమాదాలు జరగకుండా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. బుధవారం స్థానిక దుర్గామహల్ సెంటర్‌లో ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో 30 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపడం,హెల్మెట్ ధరించకపోవడం చట్టరీత్యా నేరమని, చిన్నారులకు వాహనాలు ఇస్తే వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు.

### శివస్వామికి కారంతో అభిషేకం



శివస్వామికి కారంతో అభిషేకం చేస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులో శ్రీ శివదత్తాత్రేయ ప్రత్యంగిరి వృద్ధాశ్రమంలో బుధవారం రాత్రి శివ స్వామికి 60 కేజీల కారంతో అభిషేకాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని కారాన్ని సమర్పించారు. టీటీడీ వేద పండితుడు కిషోర్ దీక్షితులు మాట్లాడుతూ ఉగ్ర రూపిణి అయిన ప్రత్యంగిరా అమ్మవారికి కారం ప్రీతికరమైందన్నారు. అమ్మవారిని ఉపాసన చేయడం ద్వారా శివస్వామి కారాభిషేకాన్ని జరిపించుకుంటున్నారని తెలిపారు. 14 ఏళ్ల నుంచి కారాభిషేకాన్ని నిర్వహిస్తున్నారన్నారు.

### వైభవంగా లక్ష బిల్వార్చన

కొయ్యలగూడెం: శ్రీదుర్గాభవాని సమేత రస లింగేశ్వరస్వామి వారికి లక్ష బిల్వార్చన పూజ బుధవారం వైభవంగా నిర్వహించారు. రుద్రాభిషేక, లక్షపత్రిపూజ, శాంతి కల్యాణం, రుద్ర హోమం నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.పండితులు బాదంపూడి సీతారామ శర్మ, శుక్ల యజుర్వేదం పండితులు లింగాల పవన్‌కుమార్ శర్మ, ఎండ్రపు సాయికుమార్ శర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక


జంగారెడ్డిగూడెం: రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.రాధాకృష్ణ, జనరల్ సెక్రటరీగా కె. నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా త్రినాథరావు, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.అయ్యన్న, ఎల్. రఘురామ్, ఉపాధ్యక్షులుగా ఎ.శిఖామణి, కె.బాలకృష్ణ, తదితరులు ఎన్నికయ్యారు

# అభివృద్ధికి ఆమడ దూరం.. చారిత్రక ప్రదేశం

- శిథిలమవుతున్న వాలీసుగ్రీవ గట్టు
- పట్టించుకోని ప్రభుత్వం
- అభివృద్ధి చేయాలని కోరుతున్న గ్రామస్తులు



పురాతన చరిత్ర తెలిపేలా గట్టుపై పాళీ భాషలో ఉన్న శిలాశాసనం



చారిత్రక ఆనవాళ్లు కలిగిన వాలీసుగ్రీవ గట్టుపై తారాదేవి ఆలయం

కామవరపుకోట: జిల్లాలో ఎన్నో చారిత్రక ప్రదేశాలు ఉన్నాయి. వాటిలో మండలంలో జీలకర్రగూడెంలోని గుంటుపల్లి బౌద్ధారామంతో పాటు వాలీసుగ్రీవ గట్టు ప్రసిద్ధి చెందినది. కామవరపుకోట శివారు పాతూరు సమీపంలో ఉంది. కానీ ఇది అభివృద్ధికి నోచుకోలేదు. ఏలూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలకు 9 కిలోమీటర్లు, కామవరపుకోట మండల కేంద్రానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే ఈ గట్టు కొన్ని దశాబ్దాల నుంచి బయట ప్రపంచానికి తెలియకుండా మరుగున పడింది. గతంలో పూర్వీకులు ఇక్కడ కార్తీకమాసంలో ప్రతి మంగళవారం తిరునాళ్లు నిర్వహించడంతో పాటు మూడో మంగళవారం చుట్టు పక్కల ప్రాంత పాఠశాలలకు సెలవు ప్రకటించే వారని గ్రామస్తులు చెబుతున్నారు. వాలీసుగ్రీవ గట్టు గౌతమ బుద్ధుడి కాలంలోనే చరిత్రకు బీజం పడిందని, తారాదేవి కోసం జరిగిన పోరాటంలో వాలీ, సుగ్రీవులు తలపడినట్లు, ఇక్కడ కూడా వాలీ, సుగ్రీవులు ఇద్దరూ ఎదురెదురుగా పోరాటం చేస్తున్నట్టుగా ఏకశిలా విగ్రహాలు ఉంటాయి. ఈ స్థలం ప్రాశస్త్యం తెలిపేలా శాసనం ఉంది. అది పాళీ భాషే అని పూర్వీకులు చెబుతుంటారు. పురాతన చరిత్ర గల ఈ ప్రాంత అభివృద్ధిని ఎవరూ పట్టించుకోకపోవడంతో తారాదేవి గుడి చీకటి గది పైన నాలుగు వైపులా చతురస్త్రాకారంలో ఉన్న బురుజు పీఠాన్ని కొందరు ఆగంతకులు గుప్త నిధుల పేరుతో కొన్నేళ్ల క్రితం తవ్వి ధ్వంసం చేశారు. ఇటీవల గ్రామస్తులు తాత్కాలికంగా కార్తీకమాసంలో పూజలు చేసినా ప్రభుత్వం వైపు నుంచి ఏ విధమైన ఆదరణ లేక వెలుగులోకి రాలేదు. ఇక అప్పట్లో పిల్లలు లేని మహిళలు పైన తారాదేవి గుడి మెట్ల దిగువ భాగంలో పానా చారాలు పడేవారు. ఇక ఈ క్షేత్రం నుంచే అప్పట్లో కామవరపుకోటను పాలించిన రెడ్డి రాజ్యాన్ని కూలగొట్టేందుకు దుండగులు వాలీ సుగ్రీవ గట్టు నుంచే ఫిరంగులతో కామవరపుకోట గట్టుపై దాడి చేసిన ఆనవాళ్ల గురించి పూర్వీకులు చెప్పేవారు. ఇంత పురాతన చరిత్ర కలిగిన వాలీసుగ్రీవ గట్టును ప్రభుత్వం గుర్తించి, దాని అభివృద్ధికి నిధులు కేటాయించి కనీసం గట్టుపైకి సరైన రహదారితో పాటు విద్యుత్, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు ఈ క్షేత్రం అభివృద్ధికి సరైన చర్యలు తీసుకుంటే వందల ఏళ్లుగా మరుగున పడిన గొప్ప చరిత్ర కలిగిన ఈ ప్రదేశం వెలుగులోకి వస్తుందని పలువురు కోరుతున్నారు.

### పూర్వం నుంచి పూజలు నిర్వహిస్తున్నాం



మా పూర్వీకుల నుంచి వాలీ సుగ్రీవ గట్టుపై కార్తీకమాసంలో పూజలు నిర్వహిస్తున్నాం. ప్రతి మంగళవారం తిరునాళ్లు నిర్వహిస్తున్నాం. ఇక్కడి ప్రాంతవాసులకు మూడో మంగళవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తుంటాం, కానీ గట్టుపై సరైన సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి.

– ఉయ్యూరు దుర్గారావు, స్థానికుడు, పాతూరు గ్రామం

### నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి



చారిత్రక ఆనవాళ్లు కలిగిన ఈ ప్రదేశం ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో మరుగున పడింది. ప్రభుత్వం స్పందించి వాలీసుగ్రీవ గట్టు పైకి రహదారి నిర్మించడంతోపాటు, విద్యుత్ సౌకర్యం, మంచినీటి సదుపాయం వంటి మౌలిక వసతులు కల్పించే విధంగా ప్రభుత్వం నిధులు కేటాయించి ఈ ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలి.

– సాయినా కనకరాజు, సొసైటీ మాజీ చైర్మన్, కామవరపుకోట

### రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేలేరుపాడు: వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ఈ నెల 22వ తేదీన విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం డీఈ పీర్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పి.నారాయణపురం 33/11 కేవీ లైన్ రాసన్నగూడెం, 33 కేవీలైన్ల మధ్య చెట్ల కొమ్మలు, ఇతర మరమ్మతులు దృష్టిలో ఉంచుకొని శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండున్నర వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

### రాజధానిపై విస్తృత చర్చ అవసరం

కొయ్యలగూడెం: దేశ రాజధానిపై జాతీయ స్థాయిలో విస్తృత చర్చలు జరగాలని రాష్ట్ర కన్జ్యూమర్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ రాజధాని మార్పుపై జరుగుతున్న చర్చలపై విజ్ఞావంతులు, మేధావులు స్పందించాలన్నారు. ప్రజలు నివాస యోగ్యంగా లేని నగరంగా దేశ రాజధాని న్యూఢిల్లీ నిలుస్తోందన్నారు. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ మారడం వల్ల దేశ అభివృద్ధిపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.

### మాజీ సర్పంచ్‌కు మాతృ వియోగం

కొయ్యలగూడెం: గవరవరం మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిపాటి రాజకుమార్‌కు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి మద్దిపాటి నీలావతి (92) వయోభారంతో చొప్పరామన్నగూడెంలోని స్వగృహంలో మృతి చెందారు. లీలావతి ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పని చేసి రిటైర్డ్ అయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు నీలావతి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నీలావతి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

### పారిజాతగిరిలో సామూహిక వ్రతాలు



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. 200 మందికి పైగా దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని సత్య నారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు, ఋషికేష్, కుమార్ ఆచార్యులు, రాఘవాచార్యులు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమ ఏర్పాట్లను కార్య నిర్వహణాధికారి మాణికల రాంబాబు పర్యవేక్షించారు. అభివృద్ధి కమిటీ సభ్యులు అబ్బిన దత్తాత్రేయ, రెడ్డి రంగ ప్రసాదరావు, దండు ధనరాజు, వాసవి సాయి నగేష్, ఇళ్ల రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మండవల్లి సోంబాబు

కొయ్యలగూడెం: ఆటో రంగంలో ఆధునికతను అందిపుచ్చుకుని వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పామర్రు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మండవల్లి సోంబాబు పేర్కొన్నారు. నరసన్నపాలెం వై.జంక్షన్ ఫ్రెండ్స్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద హెచ్‌పీసీఎల్ సంస్థ ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్టర్స్ రంగానికి చెందిన వర్గాల వారితో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయిల్‌లో కల్పిస్తున్న రాయితీ, ఆటో రంగాలకు చెందిన వారికి బీమా అమలు, ప్రయాణ సమయంలో ఉచిత మెకానిజం, వైద్య, ఆరోగ్య అమలు, ప్రమాద సమయాల్లో ఉచిత అడ్వకేట్ సహాయం గురించి ఆటో, ట్రాన్స్‌పోర్ట్ రంగాల వారు లబ్ధి పొందవచ్చన్నారు. కేజీ గోకుల్ కన్నన్, వై.శ్రీనివాస్, కె.క్రాంతికుమార్, నిమ్ము శరత్, కొయ్యలగూడెం ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ నాయకులు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

## గ్రీన్ ఫీల్డ్ హైవేలో ఎగ్జిట్ ఇవ్వాలి



వినతి పత్రం అందజేసిన సామాజిక కార్యకర్త

టి.నరసాపురం: సూర్యాపేట దేవరపల్లి నిర్మాణ దశలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ హైవేలో టి.నర్సాపురం వద్ద ఎగ్జిట్ ఇవ్వాలని కోరుతూ బుధవారం ఖమ్మంలో నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కర్నె దివ్యను ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు టి.నరసాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టి.నరసాపురం మండలానికి చెందిన పలువురు కుటుంబాలతో కలిసి తెలంగాణలోని హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాల రీత్యా నివసిస్తున్నారనీ దీంతో ఈ మండలం నుంచి హైదరాబాద్‌కు వాహనాల రాకపోకలు ఎక్కువగానే ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఊరుకొండ శ్రీనివాస్, మిట్టకోలు లక్ష్మణాద్రి, ఎండీ అహ్మద్, ఎండీ ఫిరోజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## హమాలీల కూలి రేట్లు పెంచాలి



కుక్కునూరు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ధర్నా చేస్తున్న హమాలీలు

కుక్కునూరు: పౌరసరఫరాల శాఖలో పని చేస్తున్న అల్లూరి సీతారామరాజు హమాలీ జట్టు వర్కర్ల యూనియన్ సభ్యులు హమాలీల జీతాలను పెంచాలని బుధవారం కుక్కునూరు జీసీసీ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖలో పని చేస్తున్న హమాలీలకు ప్రతి రెండేళ్లకోసారి జీతాలు పెంచాలని ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. హమాలీలకు వెంటనే కూలి రేట్ల పెంపుదల, ఎరియర్స్, బోనస్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి తక్షణమే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నాలో హమాలీలు కడారి తిరపతయ్య, గరటం శ్రీను, లాడే వెంకట్రావు, ముత్తేష్, నాగరాజు, లక్ష్మణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విజయ గణపతి ఆలయ వార్షికోత్సవం



హోమం చేస్తున్న భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని బుట్టాయగూడెం శివారులో గల కుమ్మరి గట్టు వద్ద ఉన్న విజయ గణపతి ఆలయంలో అష్టమ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం బహుళ పంచమి రోజున ఈ కార్యక్రమాన్ని పురోహితులు అనిపెద్ది రామకృష్ణ శర్మ, అనిపెద్ది సూర్య సందీప్ ఆధ్వర్యంలో 108 దంపతులతో సామూహిక లక్ష్మీగణపతి హోమాన్ని నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచన, రక్షాబంధన, పంచగవ్యప్రాసన, లక్ష్మీగణపతి మండపారాధన, ఏకవార రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి, కార్యక్రమాలను వేద పండితులచే వేదసస్తి, వేదాశీర్వచనలతో ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ నిర్మాణానికి భూదానం చేసిన ఆలపాటి దుర్గారావు దంపతులను ఆలయ కమిటీ, పురోహితులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొండేపాటి రామకృష్ణ, సోంబాబు, నాగరాజుతోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

చింతలపూడి: కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొర్లపాటి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 23న జంగారెడ్డిగూడెం పట్టణంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నామని, ఆ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుతూ చింతలపూడిలో కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్ అయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చింతలపూడి మున్సిపల్ వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు వెలగాడ అనురాధ, యూనియన్ నాయకులు ఒడిత్య బాలు, దాసరి శాయమ్మ, దాసరి రమాదేవి, పాదిలి పుల్లయ్య, దాసరి నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రక్తం అందించి మానవత్వం చాటారు

కామవరపుకోట: మాలాధారణలోని స్వాములు అనారోగ్యంతో బాధపడుతున్న ఒక మహిళకు రక్తం అందించి మానవత్వాన్ని చాటి చెప్పారు. వెలుగు గణేష్ అయ్యప్ప స్వామి మాల, నల్లమోతుల కిట్టు భవాని మాల ధరించారు. కామవరపుకోటకు చెందిన ఒక మహిళకు అనారోగ్యం ఉండటంతో జంగారెడ్డిగూడెంలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చగా ఆమెకు రక్తం తక్కువగా ఉందని, రక్తం ఎక్కించాలని డాక్టర్లు సూచించడంతో విషయాన్ని సహాయ పౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు దృష్టికి తీసుకువెళ్లగా వారు జంగారెడ్డిగూడెం వెళ్లి ఆ మహిళకు రక్తం అందజేశారు. మాలాధారణలో ఉన్నా, ఆపదలో మహిళ ప్రాణం కాపాడిన స్వాములను పలువురు అభినందించారు.

### జనావాసాల్లో వైన్‌షాపు వద్దు

కుక్కునూరు: వైన్ షాపులను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాగేంద్రరావు మాట్లాడుతూ ముంపు పేరుతో మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి పనులు చేయడం లేదన్నారు. దీంతో మండల ప్రజలు కనీస అవసరాలు కూడా తీరక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను,పులదాసు రమేష్,ఎస్.కె.మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రంథాలయ వారోత్సవాల ముగింపు



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

చింతలపూడి: గ్రంథాలయాలను విద్యార్థులు ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పలువురు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ముగింపు సభ నిర్వహించారు. గ్రంథాలయ కో–ఆర్డినేటర్ ఎస్. వర్మ, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం:

కొయ్యలగూడెం శాఖా గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ నెల 14వ తేదీన ప్రారంభమైన వారోత్సవాల్లో వారం రోజుల పాటు విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మానవత ప్రెసిడెంట్ మాటూరి సుధీర్, షేక్ జహంగీర్ భాష, అనిపెద్ది రాధాకృష్ణ పాల్గొన్నారు.

లింగపాలెం: ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం డిజిటల్ గ్రంథాలయాల వినియోగంపై ఓరియంటేషన్, స్వీయ పఠనం అనగా చదవడం మా కిష్టం, గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మాజీగూడెం ఎస్సై కె.వెంకన్న, మాజీ సొసైటీ అధ్యక్షుడు గారపాటి నాగ బుద్ధవర ప్రసాద్, గ్రంథాలయ కమిటీ సభ్యులు బీఎస్ వీఎస్ ప్రకాశరావు, కందుల చిట్టియ్య, తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట: గ్రంథాలయాలు జ్ఞానాన్ని అందజేస్తాయని శాఖ గ్రంథాలయ చైర్మన్ షేక్ ఇబ్రహీం అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక ఎంపీపీ పాఠశాల ఆవరణలో నిర్వహించి, పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.గస్ బాబు, సికే పాల్, గ్రంథ పాలకులు ఎం.భీమరాజు, గ్రంథాలయ కమిటీ సభ్యులు టీవీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: గ్రంథాలయాలను ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఎంపీడీవో కేఆర్ కృష్ణప్రసాద్, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం లోవకుమారి అన్నారు. జంగారెడ్డిగూడెం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. వారోత్సవాల్లో భాగంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని బుధవారం విశేష కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ బెజవాడ రాణి, నాగలక్ష్మి, గోదాదేవి, శ్రీకాంత్‌రావు, సచివాలయ మహిళా పోలీస్ లక్ష్మీ సుజన, గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ డీఎస్పీ

బుట్టాయగూడెం: కుల వివక్ష లేని సమాజం సాధ్యం కావాలంటే ఎస్సీ, ఎస్టీ చట్టాలు పటిష్టంగా అమలు కావాలని సీఐడీ డీఎస్పీ ఆర్‌ఓ (రాజమండ్రి) బి.నాగరాజు అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ సమావేశంలో బుధవారం ఏపీ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, అత్యాచార నిరోధక చట్టం–1989పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డీఎస్పీ మాట్లాడుతూ తప్పు చేసిన వారిపై ఎఫ్ఐఆర్, చార్జ్‌షీట్ పోలీసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పోలవరం డీఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు, జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు అచ్యుత శ్రీనివాసరావు, ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ మొడియం శ్రీనివాసరావు, జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కొవ్వాసి శ్రీనివాసరావు, జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై దుర్గామహేశ్వరరావు, రాజమండ్రి సీఐడీ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.